# పిచ్చకుంట్ల బాగోతం

మేము వేరే ఊర్లె ఎక్కడన్నా నాటకం వెయ్యాలనుకుంటె మొదట ఒకలిద్దరం సైకిల్‌మీద ఆ ఊరికి పోతం. స్టేజి ఎక్కడ వెయ్యాలో సూత్తం. సర్పంచ్‌ను ఇద్దరు ముగ్గురు పెద్దమనుషులను కలుత్తం. ఆ ఊర్లె ఇంతకుముందు ఎవలన్నా ఆటలు ఆడింగ్రా తెలుసుకుంటం. ఎవరన్నా మ్యాల్లం గట్టింగ్రా తెలుసుకుంటం. ఎవలన్నా మంత్రగాళ్లున్నరా అన్న సంగతి గూడా తెలుసుకుని ఇంటికివస్తం. అందరం కలిసి ఎన్నడు పోవాలో మాట్లాడుకుంటం. రెండుమూడు రోజులు రియార్సల్ జేస్తం.

సైకిళ్ల మీద మనిషికొక సామాను తీసుకుని పగటి యాల్లవరకు ఊరికి పోతం. మైకు పెట్టాలనుకుంటే ముగ్గురు సైకిళ్లమీద సిరిసిల్లకు పోయి పొద్దుగూకేవరకు మైకు తెత్తరు. మా ఎంబడి ఎలితబొంగులు, పరుదాలు, తబులాలు, ఆర్మాను, మేకప్ సామాన్లు బాగానే ఉంటయి.

"నారాయణ పోరం'ల ఆట ఆడుదాం. ఇప్పుడేం పని లేదుగదా... ఇండ్లల్ల గూడా ఏమనరు. పనున్నదినమైతే తిడుతరు" మా కొండయమామ అన్నడు. అందరు సరే అన్నరు.

అనుకున్నట్టే సైకిండ్ల మీద సామాన్లు కట్టుకుని నారాయణపురం బయిలెల్లినం. అది శివరాత్రి శీతలమాస సందు. కలుపులు అయిపోయినయి. ఎండలు అప్పుడప్పుడే ముదురుతున్నయి. ఊరు చేరుకుని కర్నాలగోడలల్ల స్టేజివేసినం. ఊరంతా తిరిగి అడ్విటేజ్ చేసినం. బారాన టికెటు పెట్టినం

ఇంతకుముందు స్టేజి వేసేటప్పుడు ఎంతమంది ఉందురో స్టేజి విప్పేటప్పుడు గూడా అంతేమంది ఉందురు. అడుక్కచ్చిన సామాన్లు ఎవరియి వారికి అప్పగిస్తురు. మా పరుదాలు, కట్టెలను ముల్లెకడుదురు. ఇప్పుడు ఏమైతున్నదంటే స్టేజి వెయ్యంగ వేత్తున్నరు. ఇప్పేటప్పుడు మాత్రం ఎవలూ ఉంటలేరు. వేశాలు ఇప్పంగనే అందరు మాయమై పోతున్నరు. సామాన్లు ఇప్పుడు కట్టుడు మోసుడు కొండయమామ వంతే అయితుంది.

అందుకని స్టేజి ఏసేటప్పుడే చెప్పిండు మామ. "ఒరేయ్ ఏసేటప్పుడు ఏత్తంద్రు. తీసేటప్పుడు మాత్రం ఎవలూ ఉంటలేరు. మీతాత ఇప్పుతడనుకుంటుంద్రా. ఇవన్నీ ఎవలు మోత్తరనుకుంటుంద్రు. ఇప్పుడే చెప్పుతున్న స్టేజి ఇప్పి సామాన్లన్ని ముల్లె కట్టేదాక ఎవలూ కదులద్దు. ఎవలకు అప్పజెప్పిన ముల్లెను వాళ్లు ఇంటికి పట్టుకపోవాలె".

అందరూ మంచిదని తలకాయ ఊపింద్రు. ఎప్పుడూ అట్లనే ఊపుతరు. ఏశాలు ఇడువంగనే ఎవ్వలూ కనవడరు. ఎక్కడోళ్లు అక్కడ జారుకుంటరు. ఇంతకుముందయితే భయంమీదుందురు. మామ కన్ను సైగ జేత్తె సైగ మీద నడుచుకుందురు. మామ భయం లేకున్నా పంతులు భయమన్నా ఉంటుండె. ఇప్పుడు ఏదీలేకుంట పోయింది. మాట్లాడితే మర్రవడుతున్నరు.

ఇట్లయితే ఇనరని మా కొండయమామ ఒక ఐడియా చేసిండు. ఏశకాల్లందరూ బట్టలు ఇడిసి ఏశాలు ఏత్తరుగదా! అట్లా ఏశాలు ఏసేటప్పుడు ఇడిసిన బట్టలు తీసి ముల్లెకట్టి దాచిపెట్టిండు. స్టేజి మొత్తం ఇప్పేసి ఎవల సామాన్లు వాళ్లు ముల్లెగట్టుకుంటేనే బట్టలు ఇత్తనని చెప్పిండు.

ఒకలిద్దరు కోపానికచ్చి "బట్టలు దాచిపెట్టుడెందుకు..? మేము అంత దొంగలమా..." అన్నరు. మామ గూడా కోపానికచ్చిండు. "ఎక్కడోళ్లు అక్కడ దొరలలెక్క తుడుసుకునిపోతే ఈ ముల్లెలు మూటలు నేను మొయ్యాలెనా... నాపెండ్లి కొరకు ఎత్తంద్రా ఏంది...? అందరిని నిలవెట్టే జిమ్మదారు నీదేనా" అని అడిగిండు.

ఎవలూ నోరు తెరువలేదు. ఆట మొదలయింది. మేము ఆడుతున్న ఆటపేరు

'క్రూరసేన'. తక్కువమందే వచ్చిం్రదు. అంతా అరువై రూపాయలన్నా రాలేదు. అంతదూరం నుంచి ఇంతదూరమత్తే నూరు రూపాయలన్నా రాకపాయెనని మనుసు నారాజయింది. మైకు కిరాయే నలుబైరూపాయలు పోతయి.

"అట్ల లెక్కలు చూసుకుంటరా.... ఇట్ల తయారయిం్రదు?. ఇంతకుముందు మంచిగ ఆడాలందురు. ఇప్పుడు పైసల కొరకు చూస్తం్రదు. ఇక్కడ గాకుంటే ఇంకోజాగలత్తయి. ఆట మాత్రం మంచిగా ఆడాలెనా వద్దా" అన్నడు మా పంతులు కోపంగా

మొఖాలకు రంగుపూసుకున్నా అందరికీ మనుసుల అదే సంగతి మెదులుతుంది. పాటలు సక్కగ పాడలేదు. వచనం సక్కగ చెప్పలేదు. రెండుమూడు వాదాలను పడగొట్టిం్రదు. ఎవరికి తెలువదనుకున్నరు.

ఈ 'భద్రసేన విలాసము' ఆఊరి వాళ్ళే నేర్చి ఆడిం్రదట. ఎట్లాడుతరో సూద్దామని వచ్చి ముంగటనే కూసున్నరట. ఈ సంగతి మాకు తెలువది. మేము ఎప్పుడైతే పాటలను సక్కగ పాడుతలేమో అప్పుడే గుర్తువట్టిం్రదు. వాళ్లండ్ల వాళ్లే బదులుకున్నరు.

కొండయ మామది క్రూరసేనుడివేశం. ఎగురుతున్నడు. దుంకుతున్నడు. ఆకుల పోశెట్టిది ఆడివేశం. క్రూరసేనుడి వదినె. క్రూరసేనుడు అన్నను చంపి రాజ్యాన్ని ఆక్రమించి వదినెను పొందాలనుకుంటడు. వదినె ఇదిపాపమని అడ్డు చెప్పుతుంది. ఆ వాదం జరుగుతుంది ఇప్పుడు. మామ పాటలన్నీ పాడుతుండు. వచనం చెప్పుతుండు. పోశెట్టిమాత్రం పాటలన్నీ పడగొడుతుండు. ఒకటో రెండో పాడిండు అంతే!

నిజంగా అప్పుడు జనమంతా ఏడ్వాలె. క్రూరసేనున్ని తిట్టాలె. మేము మొదట ఊర్లె ఈ ఆట ఆడిన్నాడు ఇదే వాదం జరుగుతుండంగ కుమ్మరి మల్లమ్మ లేచి 'ఓ ముండకొడుకా... ఏం బుట్టిందిరా... నీతలపండువలుగ... అన్నెంపున్నెం తెలువని పొల్లను గోసపుచ్చుకుంటన్నవు. మనిషివిగాదురా' అని తిట్టింది.

ఇప్పుడు ఏడ్సుడులేదు తుడుసుడులేదు. పోశెట్టి 'నను ముట్టరాకూ దురాత్మా' అనే పాటను గూడా ఎత్తగొట్టిండు. ఆ పాట మంచిపాట. రాగంతీసి పాడుతుంటే మనుసు కలికలి గావాలె. ఈ నాటుకం పేరెత్తితే మొదట అదే పాట యాదికి రావాలె. ఎప్పుడైతే ఈ పాట ఎత్తగొట్టిండో అప్పుడే ముందు కూసున్న ఐదుగురు వేశకాళ్లు లేచిం్రదు.

"ఓయ్.... ఏమాటాడుతున్నవు....? ఎన్నడన్నా ఆడిన మొఖమేనానీది. పిచ్చకుంట్ల బాగోతమాడుతుం్రదు. ఈ దండి ఆటకు ఆ ఊరునుంచి ఈ ఊరుకచ్చిం్రదా... రీతి మీదనే ఆడుతుం్రదా... నీ ఆట....' ఒకడు గట్టిగా అన్నడు. ఇంకొకడు మేము ఏ వాదాలను ఎత్తగొట్టినమో ఏ పాటలను పాడలేదో చెప్పిండు. అందరికీ గుండె జల్లుమంది. ఒకడైతే

మైకు ముందుకువచ్చి 'ననుముట్టరాకూ...' పాటను యాక్షన్‌తోని పాడిండు.

కొద్దిసేపు వాళ్లకూ మాకూ గిలగిలయింది. మా పంతులు అందరిని సముదాయించి కూసుండబెట్టిండు. అక్కడినుంచి ఆట పడగొట్టకుంట నడిచింది. ఎక్కడ కొద్దిగా తప్పువోయినా వాళ్లు ఊరుకుంటలేరు. మైకు ముందుకచ్చే పాడుతుండ్రు. వాళ్లు ఊరోల్లయిరి. మేము పరాఊరోల్లమైతిమి జనం గూడా వాళ్లకే సపోటున్నరు.

అటో ఇటో ఆట అయిపోయింది. అందరు ఏశాలు ఇప్పిండ్రు. సామానులన్ని సదిరితెనే బట్టలిత్తనన్నడు కొండయమామ. మనిషికొక చెయ్యేసి శాందిరి ఇప్పినం పరుదాలు ముల్లెగట్టినం. బొంగులను కట్టగట్టి సైకిండ్లకు కట్టినం. మా ఆగంల మేముంటే కొండయమామ ఆగంల కొండయమామ ఉన్నడు.

మా బట్టలన్నీ లుంగీల ముల్లెగట్టి పక్కనే ఉన్న పాతగోడ సాటుకు దాచిపెట్టిండట. ఎవలు ఎత్తుకపోయిండ్రోగనీ ముల్లెకుముల్లె మాయమైంది. పెరడంతా లెంకుతున్నడు. జాడ దొరుకుతలేదు.

అందరియి పైంట్లు, అంగీలు, దోతులు, తువ్వాలలు బనీన్లు అందులోనే ఉన్నయి. ఇప్పుడు మా పెయిలమీద ఆడివేశకాళ్లకు చీరలు, మగవేశకాల్లకు దోతులు అవి గూడా పట్టు పితాంబురాలే ఉన్నయి. ఏదో గులుక్కుంటు పెరడంతా దేవులాడుతుండు కొండయ మామ.

మామ ఆగం చూసినంక అసలు విషయం అందరికీ తెలిసిపోయింది. ఒక్కొక్కల గుండెల రాయివడ్డట్టయింది. అయ్యో!.... నా జేబుల గడియారముండెనని ఒకలు, పైసలుండెనని ఒకలు, అయ్యో ఇంటి తాళంచేతులుండెనని ఒకలు, మనిషికొక మాట. కొండయ మామను కొట్టకొట్ట వోయిండ్రు.

పెద్దలొల్లి అయింది. మాలొల్లికి చుట్టుపక్కలోల్లు లేచివచ్చిండ్రు. జరిగిన సంగతి వాళ్లకు గూడా తెలిసిపోయింది. 'ఓర్నియవ్వ.. బాగోతులోల్ల బట్టలెత్తుకపోయిండ్రట... ఇప్పుడు ఊరికి ఎట్ల వోతరు. కొందరు జాంగలమీదనే ఉన్నరు' నవ్వుకుంట గుసగుసలు పెట్టిండ్రు.

అటొర్ర ఇటొర్ర బలబల తెల్లారింది. ఆడోళ్లు లేచి వాకిళ్లు ఊడుత్తండ్రు. ఈ ముచ్చట ఆ నోట ఆనోట ఊరు ఊరంతా తెలిసిపోయింది. మమ్ములను చూడనీకి దారివట్టిండ్రు. కొందరు సైడు పరుదాలను చుట్టుకున్నరు. కొందరు జోరతట్టలను కట్టుకున్నరు. ఆడివేశకాల్లు చీరలనే గోసి పెట్టుకున్నరు.

ఎట్లన్నా తెల్లారకముందే ఊరు దాటాలనుకున్నం. లేకుంటే సిగ్గువోతది. ఎవలంతల వాళ్లు సైకిలెక్కింండ్రు. సైకిళ్లు లేనోళ్ల గోస చెప్పరాదు. సందూకుపెట్టెను పట్టుకుని సందులల్ల వడ్డరు. సైకిళ్లు ఎక్కినోళ్లు గూడా సందుల పొంటనే ఊరు దాటిండ్రు. ఎంత సందులైనా మనుసులుంటరు గదా! మమ్ములని చూసి ఒక నవ్వుడు గాదు. మా ఏశాలను చూసి కుక్కలు ఎంటవడ్డయి. అట్లనో ఇట్లనో ఊరు దాటినం. వాగుల మొఖాలు కడుక్కొని మల్లా సైకిల్లెక్కినం.

అటో ఇటో ఆ ఊరు దాటినంగనీ మా ఊరికి ఎట్లపోవాలెనో తెలుస్తలేదు. సూడు సూడుమంట ఆనాడే ఎల్లారెడ్డిపేట ఎడ్ల అంగడి. అందరు బర్లను, ఎడ్లను కొట్టుకుని తొవ్వపొంటి నడుత్తుండ్రు. మా గోస చెప్పరాదు. మనిషి వత్తున్నడంటే చెట్టుసాటుకు జాక్కోవాలె. మనిషి కండ్లవడకుంట పోయినంక తొవ్వవట్టాలె.

అట్లనో ఇట్లనో జాక్కుంట జాక్కుంట గంటతొవ్వను మూడుగంటలు నడిచి ఊరంచుకు చేరుకున్నం. అప్పటికి తొమ్మిది గొట్టింది. అందరం వాగంచుకు బతుకమ్మ గుండుకాడ కూసున్నం. అందరు బదులుకొని పెద్ద తువ్వాలను నాకు కట్టి బట్టలు తెమ్మని నన్ను ఊర్లెకు తోలిండ్రు. నేను సైకిలందుకుని ఇంటికి పోయిన

నా అవతారం జూసి మా అమ్మ తిట్టుడేగాదు. ఏం జరిగిందో చెప్పిన. అంతా విన్నంక కడుపుకుట్లువట్ట నవ్వింది. నేనుగూడా నవ్వుకుంట 'ఇప్పుడు బట్టలు తీసుకపోవాలె. లేకుంటే వాళ్లు ఊర్లెకు రారు' అన్న.

"ఆ... చిన్నమావులగాదు.. ఇల్లిల్లు తిరిగి సాకలోనిలెక్క బట్టలు ఎదురుక పోతడట. పనేం లేదురా... సక్కగ బడికిపో..." అన్నది అమ్మ గదరాయిస్తూ...

నేను తానంజేసి బట్టలేసుకుని తిని సంచిపట్టుకుని సక్కగ బడికి పోయిన. ఎవ్వలు ఏమయిండ్రో ఎప్పుడచ్చిండ్రో తెలువది గనీ కొండయమామను గొర్లమందల కాడి కుక్కలు ఎంటవడి గెదిమినయట. పల్లెమీదిగోపయ్య తాళంచేయి లేక తాళం పలుగ్గొడుతుంటే దర్వాద ఇరిగిందట గానీ తాళం పలుగలేదట.